


# ఇందుమూలంగా... – నగ్నముని

(రచనాకాలం-౧౯౮౦)

**ఇందుమూలంగా సమస్తమైనవారికీ మన ముఖాలూ కాళ్ళూ చేతులూ వగైరా సర్వాంగాలను గురించీ తెలియజేయడమేమనగా....**

ఎందుకన్నా మంచిది చివర్న కాక ఈ కథలోని నీతి ముందే చెప్పేయడం మంచిది. ఎందుకంటే ఈ కథకి స్వంత కాళ్ళూ, స్వంత చేతులూ, స్వంత మెదడూ లేవు. అందుకని కంచికి కాదుకదా కంచె వరకు కూడా చేరలేదు. మన స్వంత భుజాలమీద మన స్వంత తలకాయ ఉండడం లేదని, మన చేతులూ, చేతలూ మనవి కావనీ, మనం మనం కాక మరొకళ్ళంగా జీవితాంతం బతికేస్తున్నామనీ నాకు ప్రతిక్షణం అనిపిస్తోంది. మన స్వంత అవయవాల స్థానంలో మరొకళ్ళ అవయవాలు చోటు చేసుకునే సమయంలో వచ్చే సంఘర్షణ మనల్ని అడ్డగాడిదల్ని చేస్తోంది. ఎవడి సొంత తలకాయతో, అవయవాల్తో వాడు బతికితే ఏ గోలా ఉండదు. అది మనిషి కావచ్చు, దేశం కావచ్చు, అదీ కథ. ఇంక మీ ఇష్టం. మిగతాది చదివినా సరే. మీ సొంత నిర్ణయం మీరు తీసుకోవచ్చు.

●●●●

మనలో చాలా మందికి బతకడానికి ఒకటే ఉద్యోగం. మా ఆఫీసర్ గారికి మాత్రం రెండుద్యోగాలు. ఒకటి ఇంట్లో పెళ్ళాంగానూ, రెండోది ఆఫీసులో మాకు మొగుడిగానూ. ఆయనకి ఉద్యోగ విజయాల పద్యాలంటే ఇష్టమేగానీ, ఆఫీసులో యమధర్మరాజు ఏకపాత్రాభినయనమంటే మరీ ఇష్టం. ఆ ఉదయం నేను కనబడగానే ఆఫీసు ఇనస్పెక్షన్ పని మీద అర్జెంటుగా బెజవాడ పొమ్మని తోలేశాడు. నే వెళ్ళి అక్కడివాళ్ళు గవర్నమెంటు డబ్బు ఎట్లా ఖర్చుపెడుతున్నారో తనిఖీ చెయ్యాలన్న మాట. మా వాడికి బుద్ధిలేదు. గవర్నమెంటు డబ్బు ఎట్లా ఖర్చుపెడతారు? స్వంత డబ్బులాగ స్వంతానికి ఖర్చుపెట్టుకుంటారు. దానికి తనిఖీ దేనికి? అదో దండగ.

సరే పెళ్ళిళ్ళ సీజను. రైల్లోనూ, బస్సుల్లోనూ టిక్కెట్లు లేవు. సంచీ పుచ్చుకుని, బిక్క మొగం వేసుకుని లారీలు ఆగేచోటు నుంచున్నాను – తారకమంత్రం సడెన్‌గా మర్చిపోయిన నారదుళ్ళా. అదేం మాయో ఆ వేళ లారీలు కూడా ఆ దార్లో కనబడలేదు. ఎక్కడ యాక్సిడెంట్లు చెయ్యడానికి పోయాయో! ఎట్లారానాయనా అని వంటికి చెమట్లు పడుతున్న సమయంలో అదృష్టవశాత్తూ బెజవాడ పోతున్న దున్నపోతొకటి కనబడింది. దానికాళ్ళూ, తోకా పట్టుకుని, బతిమాలి, ఎదురుగా ఉన్న హోటల్‌కి తీసుకెళ్ళి కాస్త ఎండుగడ్డీ, కుడితీ సమర్పించుకుని, కొమ్ముకి సంచీ తగిలించి దానిమీదెక్కాను. దున్నపోతు అంతకు ముందే మందు మీదున్నట్టుంది. హుషారుగా ఊలవేస్తూ సాగించింది ప్రయాణం. మందు మీద దున్నపోతు, దానిమీద నేను బస్సు కంటే ముందరే చేరుకున్నాం బెజవాడ.

దున్నపోతుమీద పోవడం చేత కాబోలు ఆఫీసుపని, మిగతా సొంతపనులన్నీ చకచకా సజావుగా సాగిపోయినై. స్టేషన్ కొచ్చి టిక్కెట్టు తీసుకున్నాక తెలిసింది. రైలు ఒక పూట లేటుగా వస్తుందని. ఈలోగా బయట కొచ్చి పేవ్‌మెంట్ మీద తెలుగు సినిమా పాటల పుస్తకాలు కొనుక్కున్నాను. సరదాగా కాసిని రెండర్థాల బూతు పాటలు చదువుకుంటూ ప్లాట్‌ఫాం మీద గడిపేద్దామని, పాటల్తో బాటు ముంతమషాలా పొట్లాలు కాసిని కట్టించుకుని బెంచీమీద బైఠాయించాను. ఇంక నన్ను జయించేవాడు లేడు.

ఒకపూట ఆ విధంగా గడిచాక, లౌడ్ స్పీకర్లో ఎనౌన్సర్ "రైలొచ్చిందోయ్ మామ రైలొచ్చిందోయ్" అని పాడింది. కుమ్ముకుని కూచున్నాం గాని, రైలు మాత్రం వానపాములా ప్లాట్‌ఫాం మీద పడుకుండిపోయింది. ఎంతకీ కదలదు. నీళ్ళు పట్టాడు, కదల్లేదు రైలు. ఎవరో ప్రజాప్రతినిధి సలహా ఇస్తే మందు పట్టారు. తాగింది కాని కదల్లేదు రైలు. చల్లగా చెప్పారు ఇంజన్ చెడిపోయిందని. డ్రైవరు, గార్డు, స్టేషన్ మాష్టరు తెలివైన వాడవడం వల్ల బతికిపోయాం. రైలుకి అటూ ఇటూ ఇనుప గొలుసులు కట్టి రాదారి పడవలా రైల్వే కూలీలతో లాగించారు. ఒక బొజ్జాయన నా మీదా, నేను మరొకాయన మీదా, ఆయన ఇంకొకాయన మీదా పడి గుర్రుపెట్టి ఒక కునుకు తీసేప్పటికి మా ఇల్లొచ్చేసింది.

ఇనస్పెక్షన్ కెళ్ళొచ్చినా, ఖాళీ జేబులుతో తిరిగొచ్చిన మొగుణ్ణి చూసి మా ఇంటావిడ ఇంట్లో ఏమేం నిండుకున్నాయో, ఈలోగా ఎంతమంది బంధువర్గం ఇంటిమీద దండయాత్ర చేసిందో దండకం చదివి, నా శక్తి సామర్థ్యాలకి బహుమతిగా బాత్రూం తడిక పక్కన కాస్త పసుపు ముద్దపెట్టి బాల్చీలోకి వేణ్ణీళ్ళు తోడింది. కుంభమేళాకెళ్ళి కమండలం పారేసుకొచ్చిన సాధువులా ఫీలయి, ఆఫీసుకి పారిపోవడానికి అవసరమైన ప్రయత్నాల్లో పడ్డాను.

గబగబా లుంగీ లుంగ చుట్టుకుని, మంగలి పొది బయటికి తీసి, గడ్డానికి సబ్బెక్కించి రేజర్ పట్టుకుని అద్దంలోకి చూశాను. అంతే గజ్జల్లో తేలు కుట్టినట్టయింది. అద్దంలో నా ముఖం కనబడ్డం లేదు. నీళ్ళతోనూ, గుడ్డతోనూ అద్దాన్ని శుభ్రంగా తుడిచి మళ్ళీ చూశాను. ఉహూ - అద్దంలో మెడ వరకూ తప్ప నా ముఖం మాత్రం కనపడ్డంలేదు. ఇలా ఎంతకాలంగా జరుగుతోందో. అసలు ఎంతకాలంగా నాకు ముఖం లేకుండా పోయిందో ఇంతకాలం గమనించనందుకు తిట్టుకుని, ఇప్పుడే ముఖం పెట్టుకుని ఆఫీసుకెళ్ళాలిరా నాయనా అని అన్ని రాగాల్లోను ఏడ్చి, ఏం చేయాలో తోచక ఆ వేళ్టికి మాత్రం తన ముఖం అరువివ్వమని మా ఆవిడ్ని బతిమాలుకుని, ఆవిడ ముఖం తగిలించుకున్నాను. 'ఎవరన్నా నవ్వుతారేమోనండీ' అని ఆవిడ సణుగుతూనే ముఖం తీసిచ్చింది.

ఆవిడ ముఖం తగిలించుకుంటూ ఉంటే నుదుటి మీద మేకు జారి కిందపడింది. అదీ సంగతి. గవర్నమెంటు ఉద్యోగంలో చేరేటప్పుడే నుదిటిమీద మేకు కొట్టారన్నమాట. మేకు కాస్తా లూజై నా ముఖం కాస్తా ఎక్కడో జారిపడిపోయిందన్న మాట. ఆవిడ ముఖం పెట్టుకున్నాక అద్దంలోకి చూస్తే నాకే నవ్వొచ్చింది. నా మెడమీద ఆవిడ ముఖం తమాషాగా కనబడింది. బొట్టు, కాటుక, చెవులకి లోలకులు, ముక్కుకి బేసరి - సరే, అర్థనారీశ్వరుడు లేడా అని సర్దిచెప్పుకుని బయల్దేరాను.

చిత్రం - బస్సులోగాని, దారిలోగాని ఎక్కడా కూడా ఎవరూ నన్ను చూసి నవ్వలేదు. ఎందుకని నవ్వలేదా అని అందరి ముఖాల్లోకి పరిశీలనగా చూశాను. షాక్ కొట్టినట్టయింది. చాలా మందివి వాళ్ళ ముఖాలు కావు. కొందరు మొగాళ్ళకి ఆడముఖాలు, కొందరు ఆడాళ్ళకి మగముఖాలు, కొందరివి గాడిద ముఖాలు, కొందరివి ఎలుగుబంటి ముఖాలు, కొందరివి కప్ప ముఖాలు - ఇట్లా చాలామంది మనుషులు జంతువుల ముఖాలు తగిలించుకుని తిరగేస్తున్నారు. వ్యాపారాలు, ఉద్యోగాలు, రాజకీయాలు చేసేస్తున్నారు. పదవుల్లోకి పాకేస్తున్నారు.

ఆఫీసుకి చేరి, రిజిష్టర్‌లో సంతకం చేయబోతే మరోసారి షాక్ కొట్టింది. ఏమి చెయ్యనా నాయనోయ్. ఈసారి నా కుడిచేయి, కనబడ్డంలేదు. చేయివుండే చోట చొక్కా ఖాళీగా ఉండి, గాలి దూరి ఊగుతోంది. నన్ను చూసి నవ్వుతోంది. ఎడం చెయ్యి మాత్రం

మామూలుగానే ఉంది. కుడిచెయ్యి మాత్రం లేదు. ఎక్కడ పడిపోయుంటుందబ్బా అని ఆలోచిస్తూ మా ఆవిడ ముఖానికి పట్టిన చెమటని నా ఎడం చేత్తో తుడుచుకుంటూ సీట్లో కూలబడ్డాను.

ఎంత ఆలోచించినా నా కుడిచెయ్యి ఎక్కడ పడిపోయిందో తట్టలేదు. రైలు ప్రయాణంలో ఉన్నట్లుంది. బస్సు రష్షులో ఎక్కడన్నా జారిపోయుంటుందా? లేక ఎవడన్నా తస్కరించాడా? ఎంత మథనపడ్డా మా ఆవిడ ముఖంలోని ముక్కు చీదేస్తున్నదే తప్ప చెయ్యెక్కడ పోయిందో తట్టలేదు.

మా ఆఫీసరు ఇంకా రాలేదు. తోటి ఖైదీలు మాత్రం నెమ్మదిగా ఒకరొకరు వస్తున్నారు. ఈలోగా ఒక చల్లని వార్త మా ఆవిడ చెవికి సోకింది. ఆఫీసరు గారింట్లో పేరంటంట, వారు మధ్యానానికి గాని ఆఫీసుకి రారని ప్యూనుగారొచ్చి చెప్పారు. అమ్మయ్య, ఇనస్పెక్షన్ రిపోర్టు తయారు చెయ్యడానికి కాస్త టైము దొరికింది కదా అని మా ఆవిడ ముక్కుతో కాస్త ప్రశాంతంగా ఊపిరి పీల్చుకున్నాను.

సరేనయ్యా, మరి ఇనస్పెక్షన్ రిపోర్టు దేంతో రాయాలి? కుడిచెయ్యి లేదే మా బావమరిది గుర్తొచ్చాడు. రిక్షాలో బామ్మరిదింటికెళ్ళాను. మావాడు ఒక ప్రముఖ దినపత్రికలో ఉపసంపాదకుడిగా పన్జేస్తున్నాడు. నా అదృష్టం బాగుంది. దేవుడి వల్ల, విధివల్ల, అదృష్టం వల్లనేకదా మనం ఈ మాత్రమన్నా బతగ్గలుగుతున్నది. వాడు ఇంట్లోనే ఉన్నాడు. ఆవాళ వాడికి సెలవు. ఇంట్లోనే ఉల్లిపాయలు తరుగుతూ ఉన్నాడు. తరిగేవరకూ ఆగి, వాణ్ణి కూడా యధాశక్తి బతిమాలి, రాత్రికి తప్పక ఇచ్చేస్తానని ఎడం చేత్తో ప్రమాణం చేసి, వాడి కుడి చెయి తీసుకుని నా భుజానికి తగిలించుకుని, అదే రిక్షాలో ఆఫీసుకి తగలబడి రిపోర్టు రాయడం మొదలెట్టాను కానీ అదేం ఖర్మమో పట్టుమని రెండు వాక్యాలు రాయలేకపోయాను. నేను రాద్దామనుకున్న వాక్యాలు కాకుండా మా బామ్మరిది కుడిచెయ్యి దానిష్టమొచ్చిన వాక్యాలు అది రాసేస్తూంది. వాటిని నా ఎడంచెయ్యి జోక్యం కల్పించుకుని కొట్టేస్తూంది. మా బామ్మరిది పత్రికలలోనే కాక మంత్రులకీ, ఇతర పెద్ద అధికార్లకీ, ప్రముఖులకి ఉపన్యాసాలూ గట్రా రాసిపెట్టే అలవాటుంది. అందుకని, నేను రాద్దామనుకునే వాక్యాలుకాక, నా ఇనస్పెక్షన్ గురించి అన్నీ అబద్దాలు రాసేస్తూంది. నా మెదడు ఎంత చెప్పినా కుడిచెయ్యి మాత్రం వినడం లేదు. సరిగ్గా రాయమని, నిజాలు రాయమని, రాసింది కొట్టెయ్యమని మెదడు ఆజ్ఞలు జారీ చేసినా కుడిచెయ్యి పట్టించుకోవడం లేదు.

ఇంక నా వల్లగాక, రాత ఆపి, కాఫీ తాగుదామని కాంటినికి వెళ్ళాను. అక్కడా ఇంతే. సర్వర్ కాఫీ తీసుకొచ్చి పెట్టాడు. మా బామ్మరిదికి టీ అలవాటులాగుంది - కాఫీ కప్పు ముట్టుకోవడంలేదు. సరేనని, పూర్తిగా రాజీపడిపోయి టీకి ఆర్డరిచ్చాను.

వెంటనే కుడిచెయ్యి టీకప్పు ఆప్యాయంగా ఎత్తి పట్టుకుంది. పెదాలవరకీ హుషారుగా తీసుకెళ్ళింది టీ కప్పుని. అంతే - నోరు తెరుచుకోవడం లేదు. పెదాలు విడివడడం లేదు. ఆవిడకి టీ తాగితే నిద్రపట్టదు. ఈ బాధ పడలేక తిరిగి కాఫీ తెప్పించుకుని ఎడంచేత్తో తాగేశాను.

ఇంకా నయం మా బామ్మరిది ఉద్యోగం పత్రికాఫీసుకాబట్టి సరిపోయింది. అబద్దాలన్నా రాస్తూంది. మావాడు ఏ పోలీసు ఆఫీసరో కాలేదు. ఈ చేత్తో పైవాళ్ళకి సలాం చేసి, కిందవాళ్ళని చావగొట్టి ఇవాళ్ళలా ఛండాలప్పన్లన్నీ చేసేవాణ్ణి, అని ఊరడించుకుని, ఇంక లాభం లేదని వాడి చెయ్యి వాడికిచ్చేసి వద్దామని నాకాళ్ళమీద లేచి నిలబడ్డాను. ఇవి నా కాళ్ళేనా? ఇంక అన్నీ అనుమానాలే. సరే ఆవేళ్టికి నాకు సిగరెట్టు తాగే యోగంలేదని ఈ పాటికి మీకు తెలిసిపోయుంటుంది. నా భుజాల మీద కూచున్నది మా ఆవిడ ముఖంకదా!

పాత సామాన్లు అవయవాలు అమ్మే మార్కెట్టుకి పోవాలి వచ్చే ఆదివారం. నాకు సరిపోయే ముఖం, చెయ్యి ఏమన్నా దొరుకుతాయేమో కొనుక్కోవచ్చు. అందాకా ఈ బాధ తప్పదు.

●●●●

Click here to share your comments on this story